క్లుప్తంగా

మంత్రి, నేతలకు వీఆర్ఏల కృతజ్ఞతలు



టీఎన్జీవోస్ అధ్యక్షుడు అఫ్జల్‌హసన్‌ను సన్మానిస్తున్న వీఆర్ఏలు

ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మం సహకారనగర్: ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని నిర్ణయించడంపై వీఆర్ఏల సంఘం బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్.సాగర్, నందగిరి శ్రీనును కూడా కలిసి కలిసి కృతజ్ఞతలు తెలిపి మాట్లాడారు. ఇక తమ పోరాటానికి అండగా నిలిచారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు కూడా వీఆర్ఏ జేఏసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో వీరభద్రంను కలిసి సత్కరించారు. వీఆర్ఏ జేఏసీ కోచైర్మన్ రమేష్ బహదూర్, కార్యదర్శి ఎస్కే.దాదేవియా, నాయకులు వంగూరు రాములు, పోతినేని సుదర్శన్, సున్నా నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు, బండి రమేష్, బి.సరళ, రాంబాబు, కోటేశ్వరరావు, వై.విక్రమ్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన రేషన్‌డీలర్లు



మంత్రితో రేషన్‌డీలర్ల సంఘం నాయకులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను జిల్లా రేషన్ డీలర్లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు బాణోతు వెంకన్న, ప్రధాన కార్యదర్శి షేక్.జానిమియాలు మాట్లాడుతూ... తమ సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలో అన్ని జిల్లాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులను సీఎంతో సమావేశమయ్యేలా చూసి సమస్య పరిష్కారంకు కృషి చేస్తానని హామీనిచ్చినట్లు తెలిపారు. నాయకులు దొండ దుర్గయ్య, గుర్రాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలి

నేలకొండపల్లి: ఈ నెల 27న ఖమ్మంలో చేపట్టిన నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండలంలోని బోదులబండలో సోమవారం నిరుద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ఖమ్మంలో పెద్ద ఎత్తున నిరుద్యోగ మార్చ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మైనార్టీ మోర్చా మండలాధ్యక్షుడు సయ్యద్ మోహినుద్దీన్, సుధీర్‌కుమార్, సత్యనారాయణ, బాలు, నరేష్, మల్లేష్ పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కస్టడీ
వినోద	విరూపాక్ష
సాయిరాం	ఫాస్ట్ ఎక్స్
ఆదిత్య	ఉగ్రం
శ్రీనివాస	అన్ని మంచి శకునములే
సుందర్	ది కేరళ స్టోరీ

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	2
వంకాయ	20		10
బెండకాయ	18	పాలకూర	3
పచ్చిమిర్చి	60		10
కాకర	50	చుక్కకూర	2
బీర	40		10
దొండ	20	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	70	గోంగూర	2
గోరుచిక్కుడు	36		10
క్యాబేజీ	20	మెంతికూర	5
క్యాలీఫ్లవర్	24		20
ఆలుగడ్డ	24	కొత్తిమీర	1
చామగడ్డ	40		15
క్యారెట్	46	పుదీన	1
క్యాప్సికం	50		15

-ఖమ్మం వ్యవసాయం

పరిహారం పరిహాసమేనా?!

దెబ్బతిన్న పంటలకు సాయం కోసం ఎదురుచూపులు

- ప్రభుత్వం ప్రకటించినా రైతులకు అందని వైనం
- పాలేరులో మూడు విడతలుగా అన్నదాతలకు తీరని నష్టం



అప్పలనరసింహాపురంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

నేలకొండపల్లి: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. అది కూడా దాదాపు 50 రోజులు దాటుతున్నా పరిహారం అందక రైతులు ఎదురుచూస్తున్నారు. గత మార్చి 16 నుంచి 21 వరకు కురిసిన తొలి విడత వర్షాలపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదికను అందించారు. కానీ పరిహారమే అందటం లేదు ప్రభుత్వం రైతుల ఖాతాలు, ఫోన్ నంబర్లు తీసుకుంది. నేరుగా బ్యాంకు ఖాతాలకే పరిహారం బదిలీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో మరోసారి వడగళ్ల వర్షాలతో భారీగా పంట నష్టం సంభవించింది. ఈ పంట నష్టానికి సంబంధించిన వివరాలు మాత్రమే ప్రభుత్వానికి పంపించగా.. పరిహారాన్ని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అయితే రెండు, మూడో విడత పరిహారానికి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని తెలుస్తుంది. వీటిని కాదని మొదటి విడత పరిహారం అందిస్తే రైతుల నుంచి వ్యతిరేకత వస్తుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. రెండు, మూడో విడత పరిహారం కోసం మొదటి విడత పరిహారం ను కూడ నిలిపివేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

పాలేరు డివిజన్‌లో నష్టం ఇలా..

పాలేరు నియోజకవర్గంలో మార్చి, ఏప్రిల్ నెలలో జరిగిన పంట నష్టం భారీగానే జరిగింది. నేలకొండపల్లి, కూసుమంచి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో మొక్కజొన్న, వరి పంటలు బాగా దెబ్బతిన్నాయి. పంటల నష్టం అంచనాకు కూసుమంచి ఏడీఏ ఎస్.విజయచంద్ర, నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి కె.అరుణలు క్షేత్ర స్థాయిలో పంట నష్టం ను పరిశీలించారు. అందులో మొదటి విడతలో నాలుగు మండలాలు కలిసి మొత్తం 459 ఎకరాలు పంట నష్టం జరిగింది. రెండో విడత పాలేరు డివిజన్ వ్యాప్తంగా 1,902 ఎకరాలు పంట నష్టం అంచనా వేశారు. మూడో విడతలో కూసుమంచిలో రెండు ఎకరాలు, ఖమ్మం రూరల్‌లో 101 ఎకరాలు, నేలకొండపల్లిలో అర ఎకరం కూరగాయలు పంట నష్టం జరిగినట్లు అధికారిక అంచనాలు తయారు చేశారు. తిరుమలాయపాలెం మండలంలో మూడో విడత లో ఎలాంటి నష్టం జరగలేదని నివేదికను జిల్లా అధికారులకు అందించారు.

పరిహారం ఇస్తారా, లేదా?



రెండు ఎకరాలు మొక్కజొన్న నేలపాలైంది. పెట్టుబడులు పెట్టి, తీరా పంట చేతికి వచ్చే సరికి వర్షం రూపంలో నష్టం చేసింది. కనీసం ప్రభుత్వం పరిహారం అందిస్తారని ఆశగా ఎదురుచూస్తున్నాను. అసలు ఇస్తారా లేదా అధికారులు చెప్పాలి. రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– గడేటి నరసింహారావు, రైతు, అప్పలనరసింహాపురం

ఇంకెంత కాలమో..



పంట నష్టం జరిగి ఇంత కాలం అవుతున్నా పరిహారం ఇవ్వలేదు. వ్యవసాయం కు పెట్టుబడులు లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నాం. నష్టపరిహారం అందితే రైతులకు కొంత మేర ఉపశమనం కలుగుతుంది. ప్రభుత్వం ఆలోచించి వెంటనే పరిహారం అందించే ఏర్పాట్లు చేయాలి.

– బొమ్మకంటి లక్ష్మీనారాయణ, రైతు, అప్పలనరసింహాపురం

పంట నష్టం నివేదిక అందించాం..



పాలేరు డివిజన్ లో మూడు విడతలుగా జరిగిన పంట నష్టం ను క్షేత్ర స్థాయిలో సర్వే చేసి నివేదికలను సిద్ధం చేసి పంపించాం. నాలుగు మండలాల్లో జరిగిన నష్టం అంచనా నివేదికలను ప్రభుత్వ నిబంధనల మేరకు పంపించాం. ప్రభుత్వం నుంచి పరిహారం రాగానే పంపిణీ కార్యక్రమం ఉంటుంది.

– ఎస్.విజయచంద్ర, ఏడీఏ, కూసుమంచి

నా సంకల్పానికి సీఎం సహకారం

- టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) కృతజ్ఞత సభలో మంత్రి పువ్వాడ



మంత్రి పువ్వాడను సన్మానిస్తున్న టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) నాయకులు

ఖమ్మం సహకారనగర్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలనే సంకల్పం తనదే అయినా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సహకరించి కేబినెట్‌లో 23 ఎకరాల భూమిని కేటాయించారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఖమ్మం జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు భూమిని కేటాయించటంపై టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) ఆధ్వర్యాన సోమవారం నగరంలోని డీపీఆర్‌సీ భవనంలో మంత్రి పువ్వాడకు కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా మహాసభలో మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానన్నారు. ఇందులో తనకు సహకరించిన మంత్రి హరీశ్‌రావు, జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు చెప్పారు. అర్హత కలిగిన ప్రతీ జర్నలిస్టుకు ఇంటి స్థలం కేటాయించడమే కాక, సీఎం కేసీఆర్‌తో మాట్లాడి ప్రత్యేక కోటా కింద గృహలక్ష్మి పథకాన్ని వర్తింప చేస్తానన్నారు. వచ్చేనెల 2నుంచి జరిగే తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాల్లో ఇళ్ల స్థలాల పట్టాలు అందజేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్, మేయర్ పునుకొల్లు నీరజ, టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవితో పాటు సాంబశివరావు, బొల్లం శ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డి, రామకృష్ణ, రజినీకాంత్, రాఘవ, గుద్దేటి రమేష్, వినీత, భాస్కర్, రామారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఇళ్లస్థలాలు కేటాయింపునకు కృషి చేసిన మంత్రి పువ్వాడను ఫొటో జర్నలిస్టులు రాజు, మహేష్, రవి, అంజి, వెంకట్, ఉపేందర్ తదితరులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఖమ్మంను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాం..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని అన్ని డివిజన్లలో వసతులు కల్పిస్తూ తీర్చిదిద్దామని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. నగరంలోని 16, 18, 19 డివిజన్లలో పూర్తయిన అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, కార్పొరేటర్లు, నాయకులు మేదారపు వెంకటేశ్వర్లు, మందడపు లక్ష్మీమనోహర్, చామకూరి వెంకన్న, కొల్లు పద్మ, అంజిరెడ్డి, పరమేష్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

రైల్వేలైన్‌కు భూములు ఇచ్చేది లేదు..



కలెక్టరేట్ వద్ద రైతులు

నేలకొండపల్లి: డోర్నకల్–మిర్యాలగూడెం రైల్వే లైన్‌కు తమ భూములు ఇచ్చేది లేదని నేలకొండపల్లి మండల బాధిత రైతాంగం తేల్చి చెప్పింది. రైల్వే లైన్‌ను మండలం నుంచి మార్చాలని సోమవారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ను రైతులు కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ మాట్లాడుతూ.. నూతన రైల్వేలైన్ ప్రతిపాదనలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బోదులబండ ఎంపీటీసీ కట్టెకోల సుధాకర్, గువ్వలగూడెం సర్పంచ్ వంగూరి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ లిక్కి వీరబాబు, మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు యడవల్లి సైదులు, రైతు ప్రతినిధులు గోగినేని వెంకటసీతారాంబాబు, గడుపూడి పద్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను నిలిపివేయండి..

మండలంలోని రాజేశ్వరపురంలో ఇరిగేషన్, ఆర్ అండ్ బీ స్థలాను ఆక్రమించుకుని కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని గ్రామానికి చెందిన లింగరాజు కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అత్యంత విలువైన స్థలాన్ని ఆక్రమించుకుని యథేచ్ఛగా నిర్మాణం చేపడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు.

గౌర్రెల పెంపకందారుల సంఘం ఎన్నికలు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న సభ్యుడు

నేలకొండపల్లి: మండలంలోని సుర్దేపల్లిలో శ్రీ కృష్ణ గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు సోమవారం హోరాహోరీగా సాగాయి. సంఘంలో 63 మంది సభ్యులు ఉండగా, 9 మంది డైరెక్టర్లను ఎన్నుకునేందుకు పోలింగ్ నిర్వహించారు. ఈమేరకు రెండు వర్గాలుగా విడిపోయి నామినేషన్ల దాఖలు చేశారు. సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ వి.ఇందుమతి ఎన్నికల అధికారిగా వ్యవహరించగా రహస్య బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించారు. రెండు మహిళా స్థానాలకు నలుగురు పోటీ చేయగా పచ్చిపాల పద్మ, పి.నాగమ్మ ఎన్నికైనట్లు ప్రకటించారు. ఇక జనరల్ కేటగిరీలో ఏడు డైరెక్టర్ స్థానాలకు పది మంది పోటీ పడగా ఎర్రబోయిన కోటయ్య, పచ్చిపాల రవి, పి.వెంకటేశ్వర్లు, పి.వెంకయ్య, రేఖ వెంకన్న, పచ్చిపాల వెంకటనారాయణ గెలుపొందారు. ఈ కార్యక్రమంలో అధికారులు స్వప్న, డి.వరుణ్‌కుమార్, డాక్టర్ సంజయ్‌రెడ్డి పాల్గొనగా, పోలీసు బందోబస్తు నిర్వహించారు. మూడు రోజుల్లో సమావేశం ఏర్పాటుచేసి కమిటీని ఎన్నుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక

ఖమ్మంరూరల్: జాతీయస్థాయి ఉపకార వేతనాలకు మండలంలోని ఏదులాపురం ఉన్నత పాఠశాలకు చెందిన చత్రాల శ్రీవిద్య, ధనియాకుల స్ఫూర్తి, మామిడి నాగసాయిలు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శివకుమారి సోమవారం తెలిపారు. వీరికి ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగు సంవత్సరాలు వేతనాలు వస్తాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎస్ఎంసీ చైర్మన్ టి. శైలజ, గ్రామపెద్దలు తదితరులు అభినందించారు.

'నాయకులు విజ్ఞతతో మాట్లాడాలి'

ఖమ్మం మామిళ్లగూడెం: రాజకీయ నేతల మాటలు మితి మీరిపోతున్నాయని, నాయకులు విజ్ఞతతో మాట్లాడాలని బీఎస్పీ ఖమ్మం అసెంబ్లీ ఇన్‌చార్జ్ అయితగాని శ్రీనివాస్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులకు గుణపాఠం చెప్పేలా ప్రజల కోసం అవినీతిరహిత సమాజాన్ని నిర్మించడానికి వచ్చిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు అండగా ఉండాలని కోరారు.

ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలి



ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కూలీలు

ఖమ్మంమయూరిసెంటర్: పెరిగిన ధరలకు అనుగుణంగా సుతారీ కూలీ రేట్లు పెంచాలని తాపీ మేస్త్రీలు, సుతారీ కూలీలు డిమాండ్ చేశారు. సోమవారం కూలీ రేట్ల పెంపును నిరసిస్తూ బిల్డర్స్ అసోసియేషన్, క్రెడాయి ఆధ్వర్యంలో కరపత్రాలు పంచుతున్న సమయంలో గాంధీచౌక్ అడ్డాలో కూలీలు కరపత్రాల పంపిణీని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ బాధ్యులకు, కూలీలకు మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకోగా, కూలీలు అడ్డాలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ.. బిల్డర్స్ అసోసియేషన్, క్రెడాయి చెప్పిన రేట్లకే పని చేయాలనడం సరికాదని, పెరిగిన ధరలకు అనుగుణంగా తమ కూలి రేట్లు పెంచాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎన్నెస్పీ కాలనీ ప్రభుత్వ పాఠశాల 1993–94 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం రాత్రి నగరంలోని ఓ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు బి.సత్యం, కె.ప్రభాకర్‌రావు, భాస్కర్‌రావు, కెవి మాధవరావు, ఎం.నర్సమ్మ తదితరులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు నాటి స్మృతులను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శివప్రసాద్, నరేందర్, అక్బర్, శ్రీను, విజయ్, ఉమా, శివరాజీ, లత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కూసుమంచి: ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భారతీయ సర్వసమాజ్ మహాసంఘ్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ మీనన్‌కు వినతిపత్రం అందజేశారు. నిరుపేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలని, గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించాలంటూ తదితర సమస్యలు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండలాధ్యక్షుడు బాణోత్ రవినాయక్, వడిత్య భరత్‌కుమార్, జవహర్‌లాల్, కాంతారావు,జగపతి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం వెంటనే అందించాలి

నేలకొండపల్లి: అకాల వర్షాల వలన దెబ్బతిన్న పంటలకు రైతులకు పరిహారం వెంటనే ఇవ్వాలని సీపీఎం పాలేరు డివిజన్ ఇన్‌చార్జ్ బండి రమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని చెరువుమాదారం గ్రామంలో సోమవారం జరిగిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఇంటింటా సీపీఎం కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ముదిగొండ మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి, ఎరదేశి నరసింహారావు, ఎస్కె.మహమ్మద్, పాలకుర్తి బోదయ్య, నాగవెల్లి తిరపయ్య, ఏసు, వీరబాబు, మజీద్, నవాబ్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నగరంలోని త్రీటౌన్ వర్తక సంఘం భవన వద్ద సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని సంఘం అధ్యక్షులు చిన్ని కృష్ణారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సోమా నర్సింహారావు, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, కోశాధికారి తల్లాడ రమేష్, సెంట్రల్ ఈసీ సభ్యులు కొత్తమాసు హేమసుందర్‌రావు, పాయల నాగేశ్వరరావు, కైలాసపు వేణుగోపాల్ రావు, జంగిలి రమణ, ఏలేటి దామోదర్ రెడ్డి, మిర్చి శాఖ కార్యదర్శి యర్లపల్లి సతీష్, అగ్రికల్చర్ మోటార్స్ శాఖ అధ్యక్షుడు ఆమంచి రవిచందర్ పాల్గొన్నారు.

రాంరెడ్డి వెంకటరెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు


కామేపల్లి(కారేపల్లి): మాజీ మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి జయంతి వేడుకలను మండల పరిధిలోని కొత్తలింగాల క్రాస్‌రోడ్డు లో సోమవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో కొత్తలింగాల క్రాస్‌రోడ్డులో ఉన్న రాంరెడ్డి వెంకటరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ హయాంలో ఉమ్మడి రాష్ట్రానికి మంత్రిగా చేసి అనేక సంక్షేమ పథకాలను ప్రతి పల్లెకు చేరే విధంగా రాంరెడ్డి వెంకటరెడ్డి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దమ్మాలపాటి సత్యనారాయణ, రెడబోతు గోపిరెడ్డి, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, మద్దినేని రమేష్, కిన్నెర నాగయ్య, దరావత్ బాలు, గుగులోతు రవి, బుచ్చయ్య, భూక్యా లాలు నాయక్, చల్ల మల్లయ్య, బానోతు బాబు, నల్లమోతు వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- ఏసీపీ బస్వారెడ్డి

ఖమ్మంరూరల్: నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్ట్ అమలు చేస్తామని ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. సోమవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... నకిలీ విత్తనాలు అమ్మితే రైతులను మోసం చేస్తే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. నకిలీ విత్తనాల సరఫరా, ఉత్పత్తి, అమ్మకాలను అరికట్టడానికి వ్యవసాయ, పోలీస్‌శాఖ సంయుక్తంగా మండల స్థాయిలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎప్పటికప్పుడు తనిఖీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్టు తెలిస్తే 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న సదానిరంజన్

ఖమ్మం అర్బన్: నగరంలోని 4వ డివిజన్‌లోని కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీ అంకమ్మ శ్రీ మహాలక్ష్మమ్మ శ్రీ ముద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ నిర్మాణానికి రిటైర్డు ఏసీపీ జంజిరాల సదానిరంజన్, విజయశాంతి దంపతులు 25 వేల రూపాయలను ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో పాల్గొనండి

ఖమ్మం సహకారనగర్: రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో జిల్లా నుంచి యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేగినాటి ఉదయ్ కోరారు. ఈ మేరకు సోమవారం క్విజ్ పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. పోటీల్లో పాల్గొనాల్సిన వారు 7661899899 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

దాడి అమానుషం

ఖమ్మంలీగల్: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది యుగంధర్‌పై దాడి హేయమైన చర్య అని ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షులు దిరిశాల కృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. గాయపడిన యుగంధర్‌ను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

ఏటీఎంలో శునకాలు..



ఎండతీవ్రంగా ఉండటంతో తట్టుకోలేకపోతున్న వీధి కుక్కలు కూడా చల్లని ప్రాంతాలను ఎంచుకొని సేద తీరుతున్నాయి. నగరంలోని త్రీటౌన్ జూబ్లీపుర ఎస్‌బీఐ పక్కనే ఉన్న ఏటీయంలో చల్లగా ఉండే ఏటీఎంలో శునకాలు సేద తీరుతున్నాయి. ఏటీఎంకు వచ్చే వినియోగదారులు వాటి జోలికి వెళ్లకుండా నిశ్శబ్దంగా వారి పని వారు చేసుకొని వెళ్లిపోతున్నారు. అయితే కొందరు అమ్మో కుక్కలున్నాయంటూ భయపడి ఇతర ఏటీఎంలకు వెళ్తున్నారు. – ఖమ్మంవ్యవసాయం